క్లుప్తంగా

యానాది కాలనీలో ఆధార్ క్యాంపు ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్

నూజెండ్ల: మండలంలోని కమ్మవారిపాలెం గ్రామ సమీపంలోని యనాది కాలనీలో సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ నెల 11న సాక్షిలో వచ్చిన వలస జీవుల వ్యధ కథనానికి స్పందించిన అధికారులు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. యనాదుల ఆధార్ సమస్యలు తీర్చేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుతం ఆధార్ కలిగిన వారి అడ్రస్‌లో మార్పులు చేస్తున్నామన్నారు. ఆధార్ లేని వారి జాబితా తయారు చేస్తున్నామని త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు.

నేడు క్యాన్సర్ పరీక్షల ఉచిత వైద్య శిబిరం

చిలకలూరిపేట: రామకృష్ణ మెమోరియల్ నర్సింగ్ హోమ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, ఒమేగా క్యాన్సర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామకృష్ణ మెమోరియల్ నర్సింగ్ హోమ్‌లో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో మహిళలకు రొమ్ము క్యాన్సర్ పరీక్ష, గర్భ సంచి ముఖద్వార క్యాన్సర్ పరీక్ష ఉచితంగా చేస్తారని తెలిపారు. క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ ఎంజీ నాగకిషోర్, ఇతర వైద్యులు పాల్గొనే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

వినుకొండ: బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అరుంధతి కాలనీ, మహాలక్ష్మి కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుచేయాలని సీపీఎం నాయకులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ నాయక్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో సుమారు 180 మంది బాలబాలికలు ఉన్నారని, ఎలాంటి విద్యాభ్యాసానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారని, అంగన్‌వాడీ ప్రీ స్కూల్ ఏర్పాటు కోసం గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించి విన్నవించామని, తమ సమస్యలను గుర్తించి అంగన్‌వాడీ ప్రీ స్కూల్ ఏర్పాటు చేయించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం పప్పూరి వెంకటప్పయ్య, రాజారపు ముని వెంకటేశ్వర్లు, పెనుమాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కవి కమలారామ్‌కు కవిరత్న అవార్డు



వినుకొండ: పట్టణానికి చెందిన కవి కమలారామ్‌కు కవిరత్న అవార్డు లభించింది. కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఆధ్వర్యంలో వేదిక చైర్మన్, ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన మే 10, 11 తేదీలలో ఏలూరు పట్టణంలో జరిగిన ప్రపంచ తెలుగు సాహితి సంబరాల్లో ఈ అవార్డును ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకున్న కవి కమలారామ్‌ను పట్టణ ప్రముఖులు, కవులు, మిత్రులు అభినందించారు.

వైభవంగా శివనాగమల్లేశ్వరి అమ్మవారి తిరునాళ్ల



శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామంలో వేంచేసియున్న శివనాగమల్లేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయానే అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు పొంగళ్లు పొంగించి పసుపు కుంకుమ గాజులు నూతన వస్త్రాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరణ చేశారు. తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం గ్రామపురవీధుల్లో అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగించారు. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తన సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమమే

- హెచ్చరించిన సీపీఐ నాయకులు
- కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం సమర్పించిన సీహెచ్‌వోలు
- ఆరోగ్యశాఖ మంత్రి తన మాటలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్



కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు, సీహెచ్‌ఓలు

నరసరావుపేట: విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ఏడేళ్లుగా ఆరోగ్య సేవలు అందజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్(సీహెచ్‌ఓ) సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐ నాయకులు, సీహెచ్‌ఓలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)హాలులో ఏవోకు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ సీహెచ్‌ఓలు గత 15రోజుల నుంచి వేసవిలో పట్టణంలోని గాంధీపార్కుకు ఎదురుగా టెంట్ వేసి సమ్మె చేస్తున్నారన్నారు. వారు ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు, రావాల్సిన న్యాయమైన బెనిఫిట్స్ కోసం పోరాడుతున్నారన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిని కలిస్తే మీ ఉద్యోగాలు తీసేస్తామని, మీరు కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమేనంటూ బెదిరింపులకు దిగటం ఆయనకు తగదన్నారు. సీహెచ్‌ఓల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి మాటలను అసోసియేషన్ తరుపున తాము ఖండిస్తున్నామని అన్నారు. మంత్రి తన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, చర్చలు నిర్వహించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గాంధీ స్మారక సమితి వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సీపీఐ నాయకులు చక్రవాకం సత్యనారాయణరాజు ప్రసన్నకుమార్, సీహెచ్‌ఓ అసోసియేషన్ జిల్లా నాయకులు అనుపమ, సాగర్, రాము, మస్తాన్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్

శావల్యాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వర ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో సీపీఐ మండల మహాసభను సోమవారం నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు హనుమాన్‌సింగ్ ఆవిష్కరించారు. మారుతీ వర ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 20న జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇళ్లు లేని నిరుపేదలకు మూడు సెంట్లు స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిర్చి, పొగాకు పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆశించిన స్థాయిలో దిగుబడులు లేకపోవటం ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవటం శోచనీయమన్నారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రాయబారం వందనం, సహాయ కార్యదర్శిగా హనుమాన్‌సింగ్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఉలవలపూడి రాము, నియోజక వర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సక్కా శ్రీదేవి, రావూరి లక్ష్మయ్య, గురుస్వామి, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

20లోగా సుఖీభవ అర్హులు నమోదు చేసుకోవాలి

శావల్యాపురం: అర్హత కలిగిన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చర్యలు చేపట్టినట్లు ఏడీఏ బోయపాటి రవిబాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు నగదు ప్రభుత్వం నేరుగా బ్యాంకు ఖాతాకు జమ చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల్లో రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాలు జిరాక్స్‌లు అందజేసి అప్రూవల్ చేయించిన తదుపరి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. వినుకొండ రూరల్-18,898, శావల్యాపురం 12,559, ఈపూరు 15,139, బొల్లాపల్లి మండలం 17,988, నూజెండ్ల మండలం 18,300 మంది రైతులు సమగ్ర వివరాలు రైతుసేవా కేంద్రాల్లో ప్రచురణ చేసినట్లు తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ప్రాథమిక విచారణ జరుగుతుందన్నారు. ఒక కుటుంబానికి ఒకరికి మాత్రమే అర్హత పొందుతారన్నారు. ఈనెల 20లోపు ఆన్‌లైన్ నమోదుకు తుది గడవన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే వారు, విశ్రాంత ఉద్యోగులు, రూ.10వేలు దాటిన వేతనం పొందేవారు, లాయర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు తదితర వారందరికి ఈ పథకంలో అనర్హులు అన్నారు. వెబ్ ల్యాండ్‌లో భూమి కల్గిన ఉన్న రైతులు, అటవీశాఖ భూములు సాగు చేసే రైతుల జాబితాను మాత్రమే వెరిఫికేషన్ చేస్తున్నట్లు తెలిపారు.

వినుకొండ: మండలంలోని రైతులు తప్పనిసరిగా అన్నదాత సుఖీభవ పథకంలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.వరలక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు తమ పొలం పాస్‌పుస్తకం, 1బి, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబరు వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి అన్నదాన సుఖీభవ పథకంలో నమోదు చేయించుకోవాల్సిందిగా ఆమె తెలిపారు.

సమాజ సేవే ఇన్నర్‌వీల్ లక్ష్యం



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత

యడ్లపాడు: సమాజ సేవ..పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ పనిచేస్తుందని క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత చెప్పారు. సోమవారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చెంఘీజ్‌ఖాన్‌పేట బున్నీ నగర్‌లో అసిస్ట్ సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన బోర్‌వెల్‌ను ప్రేమలత ప్రారంభించారు. అనంతరం క్లబ్ బ్రాండింగ్‌లో భాగంగా ఇన్నర్‌వీల్ క్లబ్ చిహ్నాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పన, మహిళాభివృద్ధి కోసం క్లబ్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాల విస్తరణకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో దాతలు జాస్తి ప్రమీల, మద్ది లలిత, డాక్టర్ గట్టు రంగారావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ జయశ్రీ, డిస్ట్రిక్ట్ ఎడిటర్ సుభాషిణి, పీడీఎస్ కోలా విజయలక్ష్మి, క్లబ్ సెక్రటరీ నార్నే జయలక్ష్మి, పాస్ట్ ప్రెసిడెంట్ టి రమాదేవి, సభ్యులు భారతీ, ఎం పద్మావతి, జి రత్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ ఉత్సవం



రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతిని పురస్కరించుకొని రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం జయంతి ఉత్సవం నిర్వహించగా, సోమవారం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణ మహోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

చంద్రమౌళేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం



రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి వారి 97వ వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. చంద్రమౌళేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రముఖ సినీ నేపథ్య గాయకులు అనురాగ్ కులకర్ణి, రమ్య బెహారా సంగీత విభావరి ఏర్పాటు చేశారు. విభావరి కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

ప్రార్థన మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నరసరావుపేటటౌన్: ప్రార్థన మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ సూచించారు. సోమవారం హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో వన్‌టౌన్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతికత నిఘాతో ప్రార్థన మందిరాల వద్ద భద్రతను బలోపేతం చేయాలన్నారు. ఆస్తి, భక్తుల ప్రాణరక్షణకు అవసరమైన తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐలు వంశీకృష్ణ, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

పసుమర్రులో చోరీ

చిలకలూరిపేటటౌన్: మండలంలోని పసుమర్రు గ్రామంలో చోరీ కలకలం రేపింది. గ్రామానికి ఎలగాల అనసూయమ్మ ఈనెల 6న తన బంధువుల గ్రామమైన వేల్పూరుకు వెళ్లి, ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటం, ఇంట్లోని బీరువా విరగ్గొట్టి అందులో ఉన్న బంగారు ఆభరణాలు, రెండు రాగి బిందెలు, రెండు రాగి చెంబులు, ఒక ఇత్తడి చెంబు, ఒక వెండి గ్లాసు తోపాటు ఇతర విలువైన సామాన్లు గుర్తు తెలియని దుండగులు అపహరించినట్లు ఆమె గుర్తించారు. బాధితురాలు అనసూయమ్మ చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారు.

కనుల పండువగా శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల



శ్రీలక్ష్మీనరసింహ స్వామి



విద్యుద్దీపాల అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం

నకరికల్లు: స్థానిక కొండపై గల ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి తిరునాళ్ల మహోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. తిరునాళ్ల పురస్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మహిమాన్విత చరిత్ర కలిగిన స్వామి వారి తిరునాళ్ల మహోత్సవాన్ని ఆలయ అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహించారు. తిరునాళ్ల పురస్కరించుకొని స్వామి వారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. పంచామృతస్నపన గావించి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అదే కొండపై గల త్రిపురాంతకేశ్వరస్వామి వారిని కూడా దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించారు. భక్తుల సహకారంతో ఆలయకొండ కింది భాగంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాదిమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి.

బాలుర ఆశ్రమాన్ని పరిశీలించిన జిల్లా అధికారులు



విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా అధికారులు

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి పంచాయతీ పరిధిలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైల్డ్ కేర్ బాలుర ఆశ్రమాన్ని పల్నాడు జిల్లా ప్రొబేషనరీ అధికారి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి చౌరాజులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కృష్ణారెడ్డి, సీడీపీవో శ్రీలత, ఏసీడీపీవో శాంతకుమారి, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రశాంతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రశాంత్‌కుమార్‌లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రికార్డులను, ఆహారాన్ని పరిశీలించారు. గతంలో లైసెన్సు ఉందని, కాలం ముగియడంతో రెన్యువల్ కోసం చైల్డ్ కేర్‌ను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అనాథాశ్రమాలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారి వెంట ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకరరావు తదితరులు ఉన్నారు.

విస్తృతంగా విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



సమావేశంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు

క్రోసూరు: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్స్ విభాగం పల్నాడు జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ పి.విజయకుమార్ ఆధ్వర్యంలో క్రోసూరు, అందుకూరు, కొత్తూరు, పీసపాడు, గుడిపాడు, గరికపాడు, విప్పర్ల, నాగవరం, బయ్యవరం గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి అక్రమ విద్యుత్ వినియోగిస్తున్న వారిపై రూ.2.53 లక్షల అపరాధ రుసుము విధించినట్లు క్రోసూరు ఏఈ బసవరాజు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలియజేశారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 12 మందికి రూ.0.24 లక్షలు, మీటరున్నప్పటికీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి రూ.0.22 లక్షలు, అనుమతించిన కేటగిరీలు కాక ఇతర కేటగిరీలలో విద్యుత్ వినియోగిస్తున్న ఐదుగురికి రూ.0.13 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుతున్న 84 మందికి రూ.1.94 లక్షలు మొత్తం రూ.2.53 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో 39 మంది అధికారులు, 114 మంది సిబ్బంది 2,478 సర్వీసులు తనిఖీ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, సీహెచ్ రాంబొట్ల, డీఈఈ కె.రవికుమార్, ఎస్.మల్లికార్జున, రాజశేఖర బాబు, కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెదకూరపాడు: యువతి అదృశ్యంపై పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై గిరిబాబు తెలిపిన వివరాలు.. పెదకూరపాడుకు చెందిన కంచర్ల చిన్నమ్మ, మార్క్ కుమార్తె పుష్పలత విజయవాడలోని ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. పుష్పలత విధి నిర్వహణలో ఎక్కువగా ఫోన్ మాట్లాడుతుందని తండ్రి మార్క్‌కు తెలపగా ఉద్యోగం మాన్పించి పెదకూరపాడు తీసుకొచ్చారు. ఈ నెల 4న చర్చికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి నేటి వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను విచారించారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమేష్ తమ కుమార్తెను తీసుకెళ్లి ఉంటాడని అనుమానం వ్యక్త పరిచారు. తండ్రి మార్క్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త వార్తలు

వైభవంగా పెద్దరథం తిరునాళ్ల



చిలకలూరిపేట: పట్టణంలోని కొమరవల్లిపాడులో వేంచేసి ఉన్న శ్రీభూనీలా రాజ్యలక్ష్మీసమేత శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి పెద్దరథం తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాల పేర వారం రోజులు జరిగే ఉత్సవాలలో రథోత్సవం ముఖ్యమైనది. పెద్ద రథాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి మంగళవాయిద్యాల నడుమ గడియారస్తంభం సెంటర్ వద్ద గల రథశాలకు వద్దకు తీసుకువచ్చారు. వేదపండితులు రథాంగ హోమం నిర్వహించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథం మీద ఉంచారు. చిలకలూరిపేట మాజీ జమిందారులు రాజామానూరి వంశీయులు రథం తిరునాళ్లను ప్రారంభించారు. గోవిందనామస్మరణ మధ్య రథోత్సవం జరిగింది. తిరునాళ్లను తిలకించేందుకు పట్టణ పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈవో బి అశోక్‌కుమార్ పర్యవేక్షించారు.

ఎడ్వర్డ్‌పేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు



రొంపిచర్ల: మండలంలోని ఎడ్వర్డ్‌పేట గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన దాడులను పురస్కరించుకొని గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ దాడుల సందర్భంగా ఇరువర్గాలకు గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన వైఎస్సార్ సీపీ నాయకుడు కోడూరి చిన అంజిరెడ్డి వైద్యశాల్లో చికిత్స పొందుతున్నాడు. కారు దారి ఇచ్చే విషయంలో ఏర్పడ్డ చిన్న చిల్లర తగాదా కాస్త పెద్దదిగా మారింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవటంతోపాటు రాళ్లు రువ్వుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. రూరల్ సీఐ రామకృష్ణ గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని సందర్శించి, వివాదానికి గల కారణాలను ఆరా తీశారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు.

భూసారం పెంపుదలకు రైతులు కృషిచేయాలి



నరసరావుపేట రూరల్: రైతులు భూసార పరీక్షలు చేయించుకొని వాటికి అనుగుణంగా సేంద్రియ ఎరువులు, రసాయనిక ఎరువులు సమగ్రంగా వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం మండలంలోని పమిడిపాడు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన వ్యవసాయ ప్రదర్శనకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రైతులు పంట మార్పిడి పద్ధతులు పాటించటంతో పాటు నాబార్డు వారి సహకారంతో అందించే పాడి, కోళ్లు, గొర్రెలు, మేకలను పొంది వాటి పెంపకం చేసి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



నాదెండ్ల: నాదెండ్ల గ్రామంలో కొలువైయున్న పురాతన ఆలయమైన శ్రీ గంగాపార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయ రథోత్సవంలో భాగంగా బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవం అనంతరం పూర్ణాహుతి, చందనోత్సవం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే స్వామివార్లను అలంకరించి పూజాభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఇర్లపాటి సాంబశివరావు, కాశీ విశ్వనాధశర్మ, వాసు, సురేష్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్లమోతు విజయసారధి, దేవాదాయశాఖ అధికారి జక్కా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాశ్వత పరిష్కారంగా విద్యుత్‌స్తంభం ఏర్పాటు



నాదెండ్ల: ఇటీవల కురిసిన ఈదురు గాలులకు గణపవరం జాతీయ రహదారి సీఆర్ కళాశాల వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభం ఒరిగి 33 కేవీ స్తంభంపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గంటల వ్యవధిలో విద్యుత్‌ను పునరుద్ధరించారు. శాశ్వత పరిష్కారం కోసం సోమవారం ఉదయం విద్యుత్ శాఖ సిబ్బంది విరిగిన 11 కేవీ స్తంభం స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఆ ప్రాంతంలో చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించి భవిష్యత్తులో ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

సత్తెనపల్లి: ప్రతి ఒక్కరూ శాంతి, సమాధానం, ప్రేమ కలిగి ఉండాలని బోధించిన క్రీస్తు మార్గం అనుసరణీయమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంధం రవీందర్ అన్నారు. సత్తెనపల్లిలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరి బాప్టిస్ట్ చర్చ్ సండే స్కూల్ విద్యార్థులకు వారం రోజులు నిర్వహించిన విరామకాల బైబిల్ పాఠశాల(వీబీఎస్) తరగతులు ముగిశాయి. తరగతుల్లో నిర్వహించిన కంఠత వాక్యాలు, పాటలు, కథల పోటీల్లో ప్రతిభా వంతులకు బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయి ప్రతిభావంతులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సంఘ కాపరి రెవ.జె.ఇశ్రాయేలు వాక్య పరిచర్య చేశారు. గంధం రవీందర్‌ను సంఘ పెద్దలు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. వీబీఎస్ ప్రతినిధులు గుజ్జర్లపూడి శ్రీదేవి, అహల్య, సంఘ అధ్యక్షుడు స్కైలాబ్, ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, కార్యదర్శి ఆనిరాజ్ పాల్గొన్నారు.

అహింసామూర్తి బుద్ధుడు



బుద్ధుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: ప్రపంచానికి కరుణ, ప్రేమ, శాంతిని అందించిన అహింసామూర్తి గౌతమ బుద్ధుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుద్ధ జయంతిని పురస్కరించుకొని శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రకాష్‌నగర్‌లోని శ్రీతిలక్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ సర్వ మానవ సౌభ్రాతృత్వం, చతురార్య సత్యాలు, అష్టాంగ మార్గాలు బుద్ధుడు మానవాళికి అందించారని తెలిపారు. ప్రపంచ సమస్యలకు పరిష్కారం బుద్ధుని బోధనలలో ఉన్నాయని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు కె.నరసింహారావు, ఉపాధ్యాయులు పమ్మి వెంకటరెడ్డి, జాలయ్య, ఎం.కృష్ణయ్య పాల్గొన్నారు.